
డ్రైనేజీ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ

మోతీలాల్‌నెహ్రూనగర్‌లో

రూ. 6.5 లక్షలతో డ్రైనేజీ పైపులైన్

కవాడిగూడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): లోయర్ ట్యాంక్‌బండ్ మోతీలాల్ నెహ్రూనగర్‌లో రూ. 6.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ పైపులైన్ పనులకు ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ జి. రచనశ్రీ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పైపులైన్ నిర్మాణంతో మోతీలాల్‌నెహ్రూనగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో ఆరు డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని జీహెచ్ఎంజీ, వాటర్‌వర్క్స్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, జి. వెంకటేష్, పరిమళ్ కుమార్, సి. మల్లారెడ్డి, కవాడిగూడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వల్లాల శ్యామ్ యాదవ్, ఎన్‌డీ సాయికృష్ణ, బీజేపీ డివిజన్ ప్రధానకార్యదర్శి కేశవరాజు, వాటర్ వర్క్స్ డీజీఎం కార్తీకరెడ్డి, సెక్షన్ మేనేజర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటాలి


మొక్క నాటుతున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం కాచిగూడ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాచిగూడ డివిజన్‌లో బస్తీల్లో మొక్కలు నాటుతున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు ఆర్. సంతోష్, బాబన్న, లావణ్య, తార, సురేష్, రవియాదవ్ పాల్గొన్నారు.

అచ్యుత్‌రెడ్డి మార్గ్‌లో హరితహారం

రాంనగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్ అచ్యుతరెడ్డి మార్గ్‌లో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కె. సురేందర్ ఆధ్వర్యంలో గురువారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. బీఆర్ఎస్ నాయకులు రవియాదవ్, ఖలీల్, అనురాధ, దర్శ, ప్రవీణ్, ప్రియాంక, మాధవి తదితరులు పాల్గొన్నారు.

పునరావాసం కల్పించండి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న స్వామి వివేకానందనగర్ బస్తీ వాసులు

చిక్కడపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): న్యాయం చేయాలని గాంధీనగర్ డివిజన్ స్వామివివేకానందనగర్ బస్తీ వాసులు కోరారు. బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది జనవరి 29న 19 ఇళ్లను అధికారులు కూల్చివేశారని బాధితులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పునరావాసం కల్పించాలని విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో బాధితులు ఎంబీ కృష్ణ, ఆనంద్‌రావు, జ్ఞానేశ్వర్, వసంత్ ఉన్నారు.


చెత్తపై అవగాహన ర్యాలీలో కార్పొరేటర్ బి. పద్మావెంకట్‌రెడ్డి

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

రాంనగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డి సూచించారు. గురువారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ సాయినగర్ కాలనీలో ఈ-సేవ వద్ద చెత్త వేసే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ-సేవ వద్ద చెత్త వేయొద్దని ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత, శానిటేషన్ సూపర్‌వైజర్ ఎ. సుధాకర్, పారిశుధ్య సిబ్బంది, నాయకులు చంద్రమోహన్, క్రాంతి, మిరియాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


దొడ్డికొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలి

● జాజుల శ్రీనివాస్‌గౌడ్

కవాడిగూడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బీసీలను కించపరుస్తూ దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డి మాటల పట్ల మాజీ మంత్రి కేటీఆర్ స్పందించి బీఆర్ఎస్ బీసీల పక్షమో లేక కౌశిక్‌రెడ్డి పక్షమో తేల్చుకోవాలన్నారు. హైదరాబాద్ బీసీ భవన్‌లో జరిగిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో బీసీలంతా ఏకం కావాలని, తమపై దాడులకు పాల్పడుతున్న వారిని ఎదిరించి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఇటీవల కరీంనగర్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన జడ్పీటీసీ గీకు రవీందర్ ముదిరాజ్‌ను కౌశిక్‌రెడ్డి దూషించారని, బీఆర్ఎస్‌కు బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే కౌశిక్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని జాజుల డిమాండ్ చేశారు.

పింగళి వెంకయ్యకు నివాళి



జాతీయపతాక రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య వర్ధంతిని రాంనగర్‌గుండు లోని పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ట్రస్ట్ చైర్మన్ జగదాంబ పూలమాల వేసి నివాళులర్పించారు. పింగళి వెంకయ్యకు భారతరత్న ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్యామలరావు, శ్రీకాంత్, అనుదీప్, పాషా తదితరులు పాల్గొన్నారు.

\- రాంనగర్, ఆంధ్రజ్యోతి

కొణిజేటి రోశయ్య అందరి వాడు


రోశయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, గంజి రాజమౌళిగుప్తా తదితరులు

ముషీరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అందరి వాడని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. రోశయ్య జయంతి కార్యక్రమాన్ని ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య హాస్టల్‌లో గురువారం నిర్వహించారు. రోశయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. నెహ్రూ కాలం నుంచి రాహుల్ గాంధీ వరకు రాజకీయాలలో కొనసాగుతూ అందరివాడుగా పేరుతెచ్చుకున్నారని తెలిపారు. 14 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రికార్డు సృష్టించారని, ఆయన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముషీరాబాద్ వాసవీ హాస్టల్ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, ఆర్యవైశ్య కోశాధికారి ప్రభాకర్, నాయకులు సత్తయ్య, రాజశేఖర్‌గుప్తా, కృష్ణమూర్తి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రోశయ్య సేవలు మరువలేనివి

రాంనగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సుమారు 50 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక పదవులు చేపట్టిన వ్యక్తి కొణిజేటి రోశయ్య అని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం వాసవీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో రోశయ్య జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి అంతర్జాతీయ వైశ్య సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వాసవీ ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్, వాసవీ సేవా కేంద్రం పూర్వ అధ్యక్షుడు కాసనగట్టు రాజశేఖర్‌గుప్తా, సలహాదారులు కొండ్లె మల్లికార్జున్ గుప్తా, కొంపల్లి చంద్రశేఖర్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. రోశయ్య గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రిగా సేవలు అందించారని గుర్తు చేశారు. రోశయ్య సేవలకు గుర్తింపుగా కేంద్రప్రభుత్వం ఆయనకు భారతరత్న ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

వర్గీకరణ కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి

● వంగపల్లి శ్రీనివాస్


దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వంగపల్లి శ్రీనివాస్ తదితరులు

రాంనగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో పెండింగ్‌లో ఉన్న విషయాలపై చర్చలకు సిద్ధమైన తెలంగాణ, ఏపీ సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు 30 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణపై చర్చించాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని సంఘం కార్యాలయంలో వర్గీకరణ జాప్యంపై కేంద్రం మొండి వైఖరిని నిరసిస్తూ, ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 7న ఇందిరా పార్కు వద్ద దీక్ష కార్యక్రమం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు వర్గీకరణ అయిందని, అసెంబ్లీ ఎన్నికల్లో కూడా వర్గీకరణకు అనుకూల ప్రకటన చేశారని ఆయన గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి కూడా గతంలో అనేకసార్లు వర్గీకరణ కోసం సానుకూలంగా స్పందించారన్నారు. ఇద్దరు ముఖ్యమంత్రులకు మాదిగలపై చిత్తశుద్ధి ఉంటే వర్గీకరణ కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. మోదీ మాటలు చెబుతూ చేతల్లో మాదిగలకు మొండి చేయి చూపుతున్నారని ఆరోపించారు. పదేళ్ల నుంచి బీజేపీ వర్గీకరణ అంశాన్ని ఓటు బ్యాంకుగా మార్చుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ కనీసం పార్లమెంట్ సమావేశంలో ప్రస్తావించలేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నరేష్, అంజి, కొల్లూరి వెంకట్, చందు, నాగరాజు, తిరుమలేశం, శ్రీకాంత్, సురేష్, అశోక్, శివ తదితరులు పాల్గొన్నారు.


కూల్చివేతలను పరిశీలిస్తున్న డీఎంసీ మారుతీ దివాకర్

నింబోలిఅడ్డలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

బర్కత్‌పుర, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నింబోలిఅడ్డ బాలాజీ దేవాలయం వద్ద అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసీ సిబ్బంది గురువారం కూల్చివేశారు. బాలాజీ ఆలయం వద్ద రోడ్డును ఆక్రమించి ఐదు షెడ్లను అక్రమంగా నిర్మించారు. కోర్టు ఆదేశాలతో వాటిని కూల్చివేశారు. అంబర్‌పేట సర్కిల్ 15 డీఎంసీ మారుతీదివాకర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ టి. వేణు కూల్చివేతలను పరిశీలించారు. అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని, పుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తామని డీఎంసీ హెచ్చరించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ లాల్‌సాబ్, ఎస్‌టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

మరో భూ పోరాటానికి సిద్ధం కావాలి


దొడ్డి కొమురయ్యకు నివాళులర్పిస్తున్న నేతలు

చిక్కడపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో మరో భూపోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి టి. సాగర్ పిలుపునిచ్చారు. దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి గురువారం సంఘం కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో సంఘం నేతలు జంగారెడ్డి, శోభన్, ప్రసాదరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి

రాంనగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పెత్తందార్ల ఆధిపత్యంపై పోరాటం చేయడమే దొడ్డి కొమురయ్యకు నిజమైన నివాళులర్పించినట్లవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో టీపీఎస్‌కే ఆధ్వర్యంలో కొమురయ్య 78వ వర్ధంతి సభ జరిగింది. ఆయన చిత్రపటానికి టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, నాయకులు ఎస్. వినయ్‌కుమార్, రఘుపాల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. 77 ఏళ్లుగా కులగణన ఎందుకు చేయడం లేదని పాలకులను ప్రశ్నించారు. మగ్గం నడవాలి నేతన్న బతకాలి పోరుయాత్రకు సంఘీభావం తెలిపారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

● కాచిగూడ ఏసీపీ రఘు

అంబర్‌పేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బోనాలు, మొహర్రం పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని కాచిగూడ ఏసీపీ రఘు సూచించారు. అంబర్‌పేటలో గురువారం పీస్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పీస్ కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అంబర్‌పేట సీఐ అశోక్, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ఎస్ఐని వేధించిన సీఐపై చర్యలు తీసుకుంటాం'

కవాడిగూడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): దళిత ఎస్ఐ శ్రీరాములు శ్రీనును వేధించిన అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ సునీల్‌కుమార్ హామీ ఇచ్చారని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి. శంకర్ తెలిపారు. గురువారం కవాడిగూడలోని జాతీయ ఎస్సీ కమిషన్ కార్యాలయంలో సునీల్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీఐ జితేందర్‌రెడ్డి వేధింపులు భరించలేక ఎస్ఐ ఆత్మహత్యకు యత్నించారని అన్నారు. సీఐపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఎస్ఐ శ్రీరాములు శ్రీను ఆత్మహత్యాయత్నానికి కారణమైన సీఐ జితేందర్‌రెడ్డి, ఆరుగురు కానిస్టేబుళ్లపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ సోదరి శంకరమ్మ, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, నవీన్, బాధితులు యాదమ్మ, నవీన, రితీష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్య దీపికలు ఇనాక్ నవలా రచనలు


సదస్సులో మాట్లాడుతున్న శంకరనారాయణ

చిక్కడపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇనాక్ నవలా రచనల్లోని కథాంశాలు సామాజిక చైతన్యదీపికలు అని ప్రముఖ జర్నలిస్ట్, హాస్యావధాని శంకరనారాయణ ప్రశంసించారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సమాలోచన సప్తాహంలో భాగంగా గురువారం జరిగిన ఇనాక్ నవలాసాహిత్యంపై ప్రసంగం కార్యక్రమంలో సాహిత్య పరిశోధకులు డా. డి సురేఖ ప్రధాన వక్తగా పాల్గొన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న శంకరణ నారాయణ మాట్లాడుతూ.. ఇనాక్ సామాజిక చింతనతో రచనలు చేశారని అన్నారు. డా. సురేఖ మాట్లాడుతూ.. ఇనాక్ నవలా సాహిత్యంలో పాత్రలు ఆత్మన్యూనతా భావం లేనివిగా ఉంటాయని వివరించారు. నేటి యువత వాటిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, వెంకటరావు, ఆచార్య శ్రావణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాట్యగురువు వసుమతి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు.

రెండు రైళ్లలో చోరీలు

● ఆరు తులాల బంగారు నగలు, రూ. 10 వేలు అపహరణ

బర్కత్‌పుర, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అజంతా ఎక్స్‌ప్రెస్ రైలులో చోరీ జరిగింది. ప్రయాణికురాలి బ్యాగ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లిలో నివసిస్తున్న మనీష్‌రావు భార్యతో కలిసి అజంతా ఎక్స్‌ప్రెస్‌లో నగరానికి వస్తున్నాడు. ధర్మాబాద్ వద్ద అతడి భార్య చేతిలో ఉన్న బ్యాగ్‌ను గుర్తుతెలియని వ్యక్తి లాక్కొని పారిపోయాడు. బ్యాగ్‌లో మూడు తులాల బంగారు నగలు ఉన్నాయి. బాధితులు గురువారం కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మరో సంఘటనలో..

లాల్‌గర్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికురాలి బ్యాగులో ఉన్న బంగారు ఆభరణాలు, నగదును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఓల్డ్‌బోయిన్‌పల్లికి చెందిన పాపిదేవి లాల్‌గర్ ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి వస్తున్నారు. నాందేడ్ మోతికోడ్ వద్ద బ్యాగు జిప్ తెరచి ఉంది. బ్యాగ్‌లో ఉన్న మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ. 10 వేలు కనిపించకపోవడంతో గురువారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం రెండు కేసులను నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేశామని సీఐ ఎల్లప్ప తెలిపారు.



విద్యానగర్‌లో నిరసన కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు, విద్యార్థులు



నారాయణగూడ చౌరస్తా వద్ద నిరసన తెలియజేస్తున్న డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ విద్యార్థి నాయకులు


నీట్ పేపర్ లీక్ చేసిన వారిపై

కఠిన చర్యలు తీసుకోవాలి

నల్లకుంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ప్రభుత్వానికి కార్పొరేట్ శక్తులపై ఉన్న ప్రేమ విద్యారంగంపై లేదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. గురువారం విద్యానగర్‌లో ఎస్‌వీఎస్‌తో పాటు పలు ప్రాంతాలలోని జూనియర్ కాలేజీల వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తరగతులను బహిష్కరించి రాస్తారోకో నిర్వహించారు.

ఆయన మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మిస్రిన్ సుల్తానా, గణేష్, సుమన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి


బాలుడి తొడపై గాయం

ముషీరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బాలుడిపై వీధి కుక్కలు దాడి చేశాయి. ముషీరాబాద్ డివిజన్ ఫ్రెండ్స్ కాలనీలో గణేష్ కుమారుడు సుధీర్(3) ఇంటి ఎదుట నిలబడి ఉండగా వీధి కుక్కలు బాలుడిపై దాడిచేసి గాయపరిచాయి. గాయపడిన బాలుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. తమ ప్రాంతంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.


గ్రూప్-2 పరీక్ష డిసెంబర్‌లో నిర్వహించాలి


నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

చిక్కడపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులు పెంచాలని, గ్రూప్-2 పరీక్ష డిసెంబర్‌లో నిర్వహించాలని నిరుద్యోగ చైతన్య బస్సు యాత్రికుల ఆధ్వర్యంలో గురువారం చిక్కడపల్లిలోని హైదరాబాద్ నగర గ్రంథాలయంలో నిరుద్యోగులు ఆందోళన నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకుని నినాదాలిస్తూ నిరసన తెలిపారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో యాత్రా కో-ఆర్డినేటర్‌లు శివానందస్వామి, ఇంద్రప్రసాద్‌నాయక్, సభ్యులు మహేష్, ఈశ్వర్, యుగంధర్, సలీమ్ మాట్లాడారు. ఆగస్టు 5 వరకూ డీఎస్సీ పరీక్షల షెడ్యూల్ ఉండగా ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. నవంబర్‌లో నిర్వహించే గ్రూప్-3కి, గ్రూప్-2కి ఒకే సిలబస్ ఉన్నందున గ్రూప్-2 పరీక్ష డిసెంబర్‌లో నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించాలని ముఖ్యమంత్రిని కోరారు. సమావేశంలో ప్రేమ్‌కుమార్, నగేష్, అభినవ్, క్రాంతికుమార్, శివనాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

అంబర్‌పేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ సెంట్రల్ జిల్లా మహిళా మోర్చా నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అంబర్‌పేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8 నెలలు అయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, అమృత, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆనంద్‌గౌడ్, నాయకులు దాసోజు నాగభూషణం చారి, రత్నప్రభ, కవిత తదితరులు పాల్గొన్నారు.


మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ (ఎంఎల్) మాస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తదితరులు

ఎకరాకు రూ. 15 వేలు రైతు భరోసా చెల్లించాలి

రాంనగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇరవై ఎకరాలు గల రైతులకు 10 ఎకరాల వరకు ఎకరానికి రూ. 15 వేలు రైతు భరోసా చెల్లించాలని సీపీఐ(ఎంఎల్) మాస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు కోరారు. గురువారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రంగారావు మాట్లాడుతూ.. వ్యవసాయేతర భూములు, గుట్టలు, ఎన్ఆర్ఐలకు రైతు భరోసా నిలిపివేయాలని కోరారు. వరికి ఇస్తామన్న 500 రూపాయల బోనస్‌ను అన్నిరకాల వరి వంగడాలకు అమలు చేయాలన్నారు. కౌలుదారులకు కూడా పెట్టుబడి సాయం అందించాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు కె. జి.రాంచందర్, కె. సూర్యం, ఎం. హన్మేష్ తదితరులు ఉన్నారు.

గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

చిక్కడపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు పీవీ రమణ కోరారు. ఉద్యోగుల సంఘం ప్రతినిధులు బొజ్జగాని నాగార్జున, శ్రీమన్నారాయణతో కలిసి పీవీ రమణ ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. పీవీ రమణ మాట్లాడుతూ.. ఆర్టికల్ 338 ఏ ప్రకారం ఇతర రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లు విడివిడిగా ఉన్నాయని, రాష్ట్రంలో కూడా రెండు కమిషన్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. గిరిజనుల సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.


మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన ఉద్యోగుల సంఘం నేతలు

వైద్యులు దైవసమానులు

చిక్కడపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వైద్యులు దైవసమానులని కళాపోషకుడు చిల్ల రాజశేఖరరెడ్డి అన్నారు. ఆర్.కె. కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం త్యాగరాయగానసభలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యులను ప్రతిభాపురస్కారాలతో సత్కరించారు. నిర్వాహకులు డా. రంజిత్‌బిక్కునాథ్‌నాయక్, ఆకుముల్ల నాని, చందు ఆంజనేయులు, వీరబోగ వసంతరాయలు, సినీ ఆర్టిస్ట్ సంధ్య, వేణు, శ్రవణ్, ఊర్వశి, నాట్యగురువులు కల్యాణి భవ్యసాయి తదితరులు పాల్గొన్నారు.

7న మున్నూరుకాపు మహిళా ఎగ్జిబిషన్

బర్కత్‌పుర, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు మహిళలకు ఆర్థిక చేయూతనందించడానికి ఈనెల 7న మున్నూరుకాపు మహిళా ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామని తెలంగాణ మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, ట్రస్ట్‌బోర్డు ట్రస్టీ పిల్లి శ్రీనివాస్ తెలిపారు. గురువారం కాచిగూడ మున్నూరుకాపు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్‌లో అన్ని రకాల వస్తువులు, పిండి వంటలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సందర్భంగా మహిళలకు వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్నూరుకాపు మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలు శ్యామకురి సుజాత, ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ, కోశాధికారి ఆకుల జ్యోతి, ఉపాధ్యక్షురాలు జ్యోతి రాణి, మహాసభ కన్వీనర్ దండు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.